నేటి కందం- నేటికి అందం

శ్రీ రాజనాథ సింహుదు
భారత రక్షణ వ్యవస్థ ప్రౌఢిమ నెల్లన్
తీరుగ మనవారందరు
కేరింతలు కొట్టు రీతి కీర్తన జేసెన్ !!

(నాసిక్ లో రక్షణ ఉత్పత్తుల యూనిట్ లో మాట్లాడుతూ రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ భారత రక్షణ వ్యవస్థ విశేషాలను క్షమతను శక్తి సామర్థ్యాలను విశదం చేశారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

ఆధునికం ఒక దిక్కు
ఆదర్శంగా కప్పేస్తది
కులం మతం మరోదిక్కు
కుటిలంగా విప్పేస్తది
బావిలోని కప్పలాగ
బ్రతుకులీడ్చే భావాలు
వీడకుంటే మనలేవు
మనిషి ప్రగతి జీవాలు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ ఆదివారం 19-10-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:54 పేజీలు:6 వెల: రూ.1/-





పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు


## అంబర్‌పేటలో బీసీ ర్యాలీ.. కింద పడిపోయిన వీహెచ్..



హైదరాబాద్, అక్టోబర్ 18:రాష్ట్ర వ్యాప్తంగా బీసీ బంద్ ప్రశాంతంగా కొనసాగుతున్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటూ బీసీ సంఘాలు, వివిధ పార్టీల నాయకులు ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ అంబర్‌పేటలో అఖిలపక్ష నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, సీనియర్ నేత వీ. హనుమంత రావు కాంగ్రెస్‌తోపాటు బీఆర్ఎస్, సీపీఐ, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. బ్యానర్ పట్టుకుని హనుమంత రావు ర్యాలీ ముందు వరుసలో నడుస్తున్నారు. ఈ క్రమంలో బ్యానర్ కాళ్లకు అడ్డుతగలడంతో ఒక్కసారిగా కిందపడిపోయారు. వెంటనే ఆయన్ను నాయకులు పైకి లేపి సపర్యలు చేశారు.

# కొందరు ముఖ్య కార్యదర్శులు, విభాగాధిపతుల పనితీరుపై సిఎం అసంతృప్తి

## – సిఎస్, సిఎంవొ కార్యదర్శులతో సిఎం రేవంత్ రెడ్డి సమావేశం



హైదరాబాద్ అక్టోబర్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సిఎస్, సిఎంవొ కార్యదర్శులతో సిఎం రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు ముఖ్య కార్యదర్శులు, విభాగాధిపతుల పనితీరుపై సిఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. పథకాలు, అభివృద్ధి పనుల అమలులో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు అధికారుల పని తీరులో ఇంకా మార్పు రాలేదని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా.. కొందరు అధికారు పని తీరులో ఇంకా మార్పు రావట్లేదని పేర్కొన్నారు. అధికారులు అలసత్వం వీడి పనులపై దృష్టి సారించాలని ఆదేశించారు. సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావొద్దని తెలిపారు. బిజెపి కేంద్ర మంత్రులు, ఎంపిలు మోడీపై ఒత్తిడి తేవాలి: హరీశ్ రావు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తేనే పనులు వేగవంతం అవుతాయని సిఎం స్పష్టం చేశారు. ప్రజలకు మేలు జరిగే నిర్ణయాలు, కార్యక్రమాలకు ప్రాధాన్య మివ్వాలని అన్నారు. ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకొని, పనుల పురోగతిని సమీక్షించాలని.. కీలక దస్త్రాలు, పనులు ఎక్కడా ఆగిపోవడానికి వీల్లేదని పేర్కొన్నారు. కేంద్రం నుంచి గ్రాంట్లు, నిధులు రాబట్టుకునే కార్యచరణను వెంటనే చేపట్టాలని.. ఇకపై సిఎస్, సిఎంవొ అధికారులు ప్రతివారం నివేదికలు అందించాలని ఆదేశించారు.

# పాకిస్తాన్ భూభాగంలోని ప్రతి అంగుళం ఇప్పుడు బ్రహ్మోస్ అందుబాటులో ఉంది: శ్రీ రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 18:రక్షణ తయారీలో స్వావలంబన దృక్పథాన్ని బలోపేతం చేస్తూ, రక్షా మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ మరియు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్ అక్టోబర్ 18, 2025న లక్నోలోని బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ ఫెసిలిటీ సెంటర్‌లో తయారు చేసిన బ్రహ్మోస్ క్షిపణుల మొదటి బ్యాచ్‌ను సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించారు. యుపి డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో కీలకమైన ఈ అత్యాధునిక సౌకర్యాన్ని రక్షా మంత్రి మే 11, 2025న వర్చువల్‌గా ప్రారంభించారు మరియు ఐదు నెలల్లోనే మొదటి బ్యాచ్ క్షిపణులు మోహరించడానికి సిద్ధంగా ఉన్నాయి.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, రక్షా మంత్రి బ్రహ్మోస్‌ను కేవలం క్షిపణి మాత్రమే కాదని, దేశం యొక్క పెరుగుతున్న స్వదేశీ సామర్థ్యాలకు చిహ్నంగా అభివర్ణించారు. "ఈ క్షిపణి సాంప్రదాయ వార్‌హెడ్ మరియు అధునాతన గైడెడ్ వ్యవస్థను కలిగి ఉంది మరియు సూపర్‌సోనిక్ వేగంతో ఎక్కువ దూరం ఢీకొట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది.

వేగం, ఖచ్చితత్వం మరియు శక్తి కలయిక బ్రహ్మోస్‌ను ప్రపంచంలోని అత్యుత్తమ వ్యవస్థలలో ఒకటిగా చేస్తుంది. ఇది మన సాయుధ దళాలకు వెన్నెముకగా మారింది, "అని ఆయన అన్నారు.

ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ పాత్రను హైలైట్ చేస్తూ, శ్రీ రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, ఈ క్షిపణి ఒక ట్రయల్‌కు మించి ముందుకు సాగిందని మరియు జాతీయ భద్రతకు గొప్ప ఆచరణాత్మక రుజువుగా మారిందని అన్నారు.

పాకిస్తాన్ భూభాగంలోని ప్రతి అంగుళం ఇప్పుడు బ్రహ్మోన్ అందుబాటులో ఉందని ఆయన పేర్కొన్నారు. "ఆపరేషన్ సిందూర్ అనేది విజయం మనకు అలవాటుగా మారిందని, ఇప్పుడు మనం మన సామర్థ్యాలను మరింత పెంచుకోవాలి అనేదానికి రుజువు.

ఆపరేషన్ కేవలం ట్రైలర్ మాత్రమే. దీని తర్వాత ఏమి జరుగుతుందో పాకిస్తాన్ గ్రహించేలా చేసింది" అని ఆయన అన్నారు.

నేడు భారతదేశం తన భద్రతను బలోపేతం చేసుకుంటున్న దశలో ఉందని మరియు రక్షణ మరియు సాంకేతికతలో విశ్వసనీయ భాగస్వామి అని ప్రపంచానికి ప్రదర్శిస్తున్న దశలో ఉందని రక్షా మంత్రి నొక్కి చెప్పారు. బ్రహ్మోస్ వంటి విజయాలు మేడ్-ఇన్-ఇండియా ఇకపై నినాదం కాదని, ప్రపంచ బ్రాండ్ అని నిరూపించాయని ఆయన నొక్కి చెప్పారు.

"ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోన్‌ను ఎగుమతి చేయడమైనా లేదా భవిష్యత్తులో ఇతర దేశాలతో సహకారం అందించడమైనా, భారతదేశం ఇప్పుడు కేవలం తీసుకునే వ్యక్తిగా కాకుండా ఇచ్చే పాత్రను పోషిస్తోంది. ఇది ఆత్మనిర్భర్ భారత్ యొక్క నిజమైన గుర్తింపు, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం 2014లో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. 2047 నాటికి పూర్తిగా అభివృద్ధి చెందిన, స్వావలంబన కలిగిన మరియు ప్రపంచాన్ని నడిపించడానికి సిద్ధంగా ఉన్న భారతదేశం యొక్క దార్శనికతను ప్రధానమంత్రి మోడీ మనకు అందించారు.

ఈ ప్రయత్నంలో రక్షణ రంగం పాత్ర నిర్ణయాత్మకంగా ఉంటుంది, "అని ఆయన అన్నారు.

గత ఒక నెలలో బ్రహ్మోస్ బృందం రెండు దేశాలతో సుమారు రూ.4,000 కోట్ల విలువైన ఒప్పందాలపై సంతకం చేసిందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలియజేశారు. రాబోయే సంవత్సరాల్లో, అనేక దేశాల నుండి నిపుణులు లక్నోను సందర్శిస్తారని, నగరాన్ని జ్ఞాన కేంద్రంగా మరియు రక్షణ సాంకేతిక పరిజ్ఞానంలో అగ్రగామిగా మారుస్తారని ఆయన పేర్కొన్నారు. "వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి బ్రహ్మోస్ లక్నో యూనిట్ టర్నోవర్ దాదాపు రూ.3,000 కోట్లుగా ఉంటుందని మరియు జిఎస్‌టి వసూలు దాదాపు రూ.500 కోట్లుగా ఉంటుందని" ఆయన అన్నారు.

## టపాసుల గోదాంలో అగ్ని ప్రమాదం

హైదరాబాద్, అక్టోబర్ 18:సంగారెడ్డి జిల్లా, ఆందోల్ శివారులోని టపాసుల గోదాంలో అగ్ని ప్రమాదం సంభవించింది. గుర్తు తెలియని వ్యక్తి అగ్గి రాజేయడంతో మంటలు చెలరేగినట్టు భావిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి.

ఇంటర్నెట్ డెస్క్: సంగారెడ్డి జిల్లా, ఆందోల్ శివారులోని కటుకం వేణుగోపాల్ & సన్స్ టపాసుల గోదాంలో అగ్ని ప్రమాదం సంభవించింది. గుర్తు తెలియని వ్యక్తి అగ్గి రాజేయడంతో మంటలు చెలరేగినట్టు భావిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి.

మంటల్ని ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు. విక్రయదారులకు తృటిలో పెనుప్రమాదం తప్పినట్టు తెలుస్తోంది. బాణాసంచా గోదాం యాజమాన్యం ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించలేదని తెలుస్తోంది. ఈ ప్రమాదంలో టపాసుల గోదాం పూర్తిగా కాలి బూడిదైంది.

# గ్రూప్-2 ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 18: గ్రూప్-2 పరీక్షలో విజేతలకు ఇవాళ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. విద్యార్థి, నిరుద్యోగ యువత ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్న సీఎం.. అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో పదేళ్లు అధికారం చెలాయించిన వాళ్లు ఒక్కక్షణం కూడా నిరుద్యోగుల గురించి ఆలోచన చేయలేదని విమర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ పలు అంశాలపై మాట్లాడారు.

'అమరుల ఆశయ సాధనపై వాళ్లు ఆలోచన చేసి ఉంటే మీకు ఎనిమిదేళ్ల క్రితమే ఉద్యోగాలు వచ్చేవి. వాళ్ల కుటుంబంలో పదవులు భర్తీ చేసుకున్నారు తప్ప, గ్రూప్ 2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వలేదు. పదిహేనేళ్లుగా గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీ జరగలేదంటే, ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉంటుందా? ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మేం గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేశాం. గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించి ఇవాళ నియామక పత్రాలను అందిస్తున్నాం.' అని సీఎం రేవంత్ అన్నారు.

# పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్యకు కేటీఆర్ భరోసా..

హైదరాబాద్, అక్టోబర్ 18: పద్మశ్రీ అవార్డు గ్రహీత, తెలంగాణ జానపద సాహితీ ముద్దుబిడ్డ అయిన దర్శనం మొగులయ్యకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మొగులయ్య ఈరోజు కేటీఆర్ నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

మొగులయ్య ఆరోగ్యం, యోగక్షేమాల గురించి కేటీఆర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా మొగులయ్య తన కంటిచూపు మందగించిందని, చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కేటీఆర్, మొగులయ్యకు హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌లో పూర్తి చికిత్సను అందించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

అనంతరం మొగులయ్య, గత ప్రభుత్వం తనకు హయత్ నగర్ మండలంలో కేటాయించిన 600 గజాల స్థలం విషయంలో కొంతమంది వ్యక్తుల నుండి ఎదురవుతున్న ఇబ్బందులు, కోర్టు కేసుల వివరాలను కేటీఆర్‌కు వివరించారు. దీనిపై తక్షణమే స్పందించిన కేటీఆర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. మొగులయ్యకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన భూమి విషయంలో కొందరు వ్యక్తులు కోర్టుల్లో కేసులు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి, మొగులయ్యకు న్యాయం చేయాలని కోరారు. అలాగే, మొగులయ్య ఆ స్థలంలో కట్టుకున్న గదిని కూడా కొంతమంది కూల్చివేసిన పరిస్థితి ఉందని మొగులయ్య చెప్పారని పేర్కొన్నారు. మొగులయ్య భూమికి, ఆయన కుటుంబానికి తగిన రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు కేటీఆర్ సూచించారు. అవసరమైతే, మొగులయ్యకు ఎదురవుతున్న న్యాయపరమైన కేసులను ఎదుర్కొనేందుకు కూడా సహాయం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా మొగులయ్య కేటీఆర్‌తో మాట్లాడుతూ, ఒకప్పుడు అడవుల్లో కిన్నెర వాయించుకునే తనకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రేమతోనే గుర్తింపు దక్కిందని తెలిపారు. కేసీఆర్ గుర్తించడం వలనే తన కళ ప్రపంచం దృష్టికి చేరిందని, తదనంతరం పద్మశ్రీ అవార్డు కూడా దక్కిందని పేర్కొన్నారు. కేసీఆర్ తమ కుటుంబం కోసం చేసిన సహాయానికి, తమ కష్టాలన్నీ తీర్చినందుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. తన ఇంటి స్థలం వివాదాన్ని పరిష్కరించి, కోర్టు కేసుల విషయంలో సహాయం చేయాలని మొగులయ్య కేటీఆర్‌ను విజ్ఞప్తి చేశారు.

# మంత్రి సీతక్కతో గ్రామ పంచాయతీ కారోబార్ల ఉద్యోగుల సంఘం భేటీ



హైదరాబాద్, అక్టోబర్ 18:తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ ఉద్యోగులు(కారోబార్లు) సంఘం ప్రజా భవన్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో శనివారం భేటీ అయ్యారు. గత 35 సంవత్సరాలుగా గ్రామపంచాయతీలో కారోబార్లుగా పనిచేస్తున్న తమకు 51 జీవోను మినహాయించి, బిల్ కలెక్టర్లుగా ప్రమోషన్ ఇచ్చి పే స్కేల్ వర్తింపచేయాలని మంత్రికి వినతి పత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన మంత్రి సీతక్క 51 జీవో, బిల్ కలెక్టర్ ప్రమోషన్‌కు సంబంధించిన ఫైల్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పే స్కేల్ పై చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమములో గ్రామపంచాయతీ కారోబార్స్ రాష్ట్ర నాయకులు మామిడాల నర్సింహులు, శ్రీనివాస చారి, రవి యాదవ్, నాగరాజు, శ్రీధర్ యాదవ్, వెంకటేష్, సురేందర్, కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా భూస్థాపితం



హైదరాబాద్, అక్టోబర్ 18 : బిసి లకు ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుంటే కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా భూస్థాపితం చేసేందుకు వెనుకబడిన వర్గాలు సిద్ధంగా ఉన్నాయని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. శనివారం బిసి బంద్ లో భాగంగా ఆర్టీసీ క్రాస్ రోడ్ లో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేఇచ్చిన హామీని అమలు చేయాలని ప్రతిపక్షంగా తాము బంద్ లో పాల్గొంటున్నామని, ఇచ్చిన హామీ అమలు చేయాల్సిన కాంగ్రెస్ పార్టీ, చట్టబద్ధత కల్పించాల్సిన బి జె పి పార్టీ ల నాయకులు సిగ్గు లేకుండా రోడ్ల పైకి వచ్చారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ లో బిల్లుకు తాము సంపూర్ణ మద్దతు తెలిపామని, దానిని గవర్నర్ కు పంపారని, గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్ లో ఉండగా నే ఆర్డినెన్స్, ఆ తర్వాత ఊా లను తీసుకొచ్చిందని విమర్శించారు. బిసి లను మోసం చేయడానికి అనేక డ్రామాలు ఆడుతున్నారని, మా ఆత్మ గౌరవం కోసం మేము పోరాడుతున్నామని స్పష్టం చేశారు. తమ ఉద్యమం రానున్న రోజుల్లో మరింత ఉధృతం అవుతుందని స్పష్టం చేశారు. 22 నెలల కాంగ్రెస్ పాలన పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ పార్టీ జంతర్ మంతర్ లో నిర్వహించిన ధర్నాలో మీ అగ్రనాయకత్వం ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. పార్లమెంట్ లో బిల్లు పెట్టి 9 వ షెడ్యూల్ లో చేరిస్తేనే చట్టబద్ధత లభిస్తుందని తెలియదా? అని ప్రశ్నించారు. బిసి లకు 42 శాతం రిజర్వేషన్ కు చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఇది ఆరంభం మాత్రమేనని, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళ్తామని వివరించారు.

# విద్యుత్ అధికారుల పల్లెబాట

నల్గొండ, అక్టోబర్ 18: గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సమస్యలను పరిష్కరించడానికి విద్యుత్ శాఖ పల్లె బాట కార్యక్రమం చేపట్టింది.

ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో ఎస్ఈ ఆర్. సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ అధికారులు పల్లె బాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పెరిగిన చెట్లను తొలగించారు. దీంతో పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా మరమ్మతులు చేపటారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ పి.యాదగిరి, ఏడీ మచ్చేందర్, ఏఈ మనోహర్ రెడ్డి, లైన్ మెన్ ఆర్.బాల్ నరసింహ, లుమ్ బా నాయక్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# వెట్టి చాకిరీ నుంచి 14 మందికి విముక్తి

నాగర్‌కర్నూలు, అక్టోబర్ 18: జిల్లాలోని అమరగిరిలోని కృష్ణానదిలో వెట్టిచాకిరి చేస్తున్న 14 మంది వలస కార్మికులకు విముక్తి కలిగింది. నేషనల్ ఆదివాసీ సాలిడారిటీ కౌన్సిల్, మానవ అక్రమ రవాణా సంస్థ, కొల్లాపూర్ పోలీసులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. ఒరిస్సా, ఏపీ రాష్ట్రాలకు చెందిన 14 మంది లేబర్లను గుర్తించి వారిని స్వస్థలాలకు పంపేందుకు పోలీసులు ఏర్పాటు చేస్తున్నారు. సరిగ్గా భోజనం పెట్టకుండా తిడుతూ, కొట్టి పనిచేయిసున్నారని, చెరువులో చేపలు పట్టడం అని తీసుకువచ్చి నదిలో పట్టిస్తున్నారని కార్మికులు వాపోయారు. వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించిన అధికారులకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ వ్యవహారంపై అధికారులు మీడియాతో మాట్లాడుతూ... అమరగిరిలోని కృష్ణానదిలో ఆంధ్ర, ఒరిస్సా నుంచి లేబర్లను తీసుకొచ్చి నిర్బంధించారని డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీకి చెందిన మెజిస్ట్రేట్‌కు ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారని చెప్పారు. మెజిస్ట్రేట్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఒరిస్సాకు చెందిన 11 మంది కార్మికులు, విశాఖకు చెందిన ముగ్గురు కార్మికులను వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించామని తెలిపారు. కార్మికులను వారి స్వగ్రామాలకు పంపేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విచారణ అనంతరం కార్మికులను బలవంతంగా తీసుకువచ్చినట్లు నిర్ధారణ అయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

చెరువులో చేపలు పట్టాలని తీసుకువచ్చారని ఇబ్బందులకు గురిచేసినట్లు కార్మికులు తెలిపారు. వేరే పని ఇస్తామని నమ్మబలికి ఇక్కడకు తీసుకువచ్చి వెట్టి చాకిరీ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. పనిచేయకపోతే తిట్టే వారని, హింసించే వారిన కార్మికులు వాపోయారు.

# వ్యవసాయ యంత్రాలపై సవరించిన జీఎస్టీ రేట్లు రైతులకు ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనాలను అందించాయి: శ్రీ చౌహాన్



న్యూఢిల్లీ, అక్టోబర్ 18:ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లోని దుమ్రి ఖుర్ద్ గ్రామంలో నిర్వహించిన 'గ్రామ్ చౌపాల్' సందర్భంగా కేంద్ర వ్యవసాయం ఒ రైతు సంక్షేమం మరియు గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు మన గ్రామీణ సోదర సోదరీమణులతో సంభాషించారు. ఈ సందర్భంగా స్థానికులు, రైతులు, స్వయం సహాయక బృందం (రాఊఉ) సభ్యులు మరియు పంచాయతీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర మరియు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాల ఉమ్మడి ప్రయత్నాల గురించి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడారు మరియు ఉత్పత్తిని పెంచడానికి, మెరుగైన విత్తనాలను అందించడానికి మరియు ఖర్చులను తగ్గించడానికి ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని అన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద పంట నష్టాలకు పరిహారం చెల్లిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. రైతులతో సంభాషించేటప్పుడు, ప్రధాన పంటలు, ఉత్పత్తి ఖర్చులు మరియు స్థానిక ఆహార దుకాణాల అవసరం వంటి అంశాలపై కూడా ఆయన అభిప్రాయాన్ని తీసుకున్నారు.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'పప్పుధాన్యాలలో స్వావలంబన మిషన్' కింద పప్పుధాన్యాలు మరియు పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచే చొరవ గురించి శ్రీ చౌహాన్ తెలియజేశారు మరియు రైతుల నుండి సలహాలను కూడా కోరారు. ఈ సంవత్సరం, కేంద్ర ప్రభుత్వం రబీ పంటలకు కనీస మద్దతు ధర (ఓాఖ) పెంచిందని, ఇది రైతులకు గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గోధుమ, పప్పుధాన్యాలు, పప్పుధాన్యాలు మరియు ఆవాలకు ఓాఖ పెరుగుదల వివరాలను ఆయన పంచుకున్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ నాయకత్వంలో, వ్యవసాయ యంత్రాలపై జీఎస్టీ రేట్లను 12% మరియు 18% నుండి 5%కి తగ్గించామని, దీనివల్ల రైతులకు ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయని శ్రీ శివరాజ్ సింగ్ పేర్కొన్నారు.

వ్యవసాయంతో పాటు పశు సంవర్ధకం, మత్స్య సంపద, తేనెటీగల పెంపకం మరియు ఉద్యానవనాలను కూడా స్వీకరించాలని కేంద్ర మంత్రి రైతులను కోరారు. జంతువులకు టీకాలు వేయడానికి ప్రభుత్వ పథకాల గురించి కూడా ఆయన సమాచారాన్ని పంచుకున్నారు.

ఈ 'గ్రామ్ చౌపాల్'లో పెద్ద సంఖ్యలో రైతులు, స్వయం సహాయక బృంద సభ్యులు మరియు పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు, అక్కడ వారు తమ సమస్యలు మరియు సూచనలను కేంద్ర మంత్రి శ్రీ చౌహాన్‌తో పంచుకున్నారు. కార్యక్రమం ముగింపులో, శ్రీ చౌహాన్ గ్రామీణాభివృద్ధి మరియు వ్యవసాయ శ్రేయస్సు కోసం అందరూ సహకరించాలని మరియు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# కల్మికియాకు పవిత్ర అవశేషాల ప్రదర్శన భారతదేశం & రష్యా మధ్య సంబంధాలను బలోపేతం చేస్తుంది: శ్రీ మనోజ్ సిన్హా



న్యూఢిల్లీ, అక్టోబర్ 18:జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ మనోజ్ సిన్హా మాట్లాడుతూ, కల్మికియాకు బుద్ధుని పవిత్ర అవశేషాలను ప్రదర్శించడం వల్ల భారతదేశం ఒ రష్యా మధ్య ప్రజలకు మధ్య సంబంధాలు బలపడతాయని అన్నారు. "శాక్యముని బుద్ధుని స్వర్ణ నివాసం"గా ప్రసిద్ధి చెందిన ఐకానిక్ గెడెన్ షెడ్డుప్ చోయికోర్లింగ్ ఆశ్రమంలో ప్రతిష్టించబడిన అవశేషాలకు గౌరవపూర్వకంగా నివాళులర్పించిన తర్వాత మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ, కల్మికియాలో బుద్ధుని పవిత్ర అవశేషాల ప్రదర్శన అనేది ఐరోపాలోని ఏకైక బౌద్ధ దేశమైన కల్మిక్ ప్రజలకు విశ్వాసం యొక్క చారిత్రాత్మక స్వదేశానికి తిరిగి రావడాన్ని సూచించే ఒక మైలురాయి సంఘటన అని అన్నారు. ఇది భారతదేశం మరియు రష్యా మధ్య ఆధ్యాత్మిక స్నేహానికి శక్తివంతమైన వంతెనగా నిలుస్తుంది, సాంస్కృతిక సంబంధాలలో భారతదేశం యొక్క ప్రయత్నాలను మరియు బుద్ధుని బోధనల ఏకీకరణ శక్తిని ప్రదర్శిస్తుంది.

కల్మికియా రిపబ్లిక్ రాజధాని నగరం ఎలిస్టాలో బుద్ధుని పవిత్ర అవశేషాలను ప్రదర్శించిన తర్వాత వాటిని భారతదేశానికి తిరిగి తీసుకురావడానికి జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ మనోజ్ సిన్హా శుక్రవారం రష్యా చేరుకున్నారు. భారత ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న శ్రీ షినాకు కల్మికియా ప్రభుత్వ మొదటి డిప్యూటీ చైర్మన్ త్సెరెనోవ్ ఎర్డ్ని నికోలాయెవిచ్, డిప్యూటీ చైర్మన్ జాంబినోవ్ ఓచిర్ వ్లాదిమిరోవిచ్ మరియు భారత డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ శ్రీ నిఖిలేష్ గిరి స్వాగతం పలికారు. ఈ ప్రతినిధి బృందం అక్టోబర్ 19, 2025న పవిత్ర అవశేషాలతో భారతదేశానికి తిరిగి వెళుతుంది.

ముందుగా, శ్రీ సిన్హా కల్మికియాకు బయలుదేరుతున్నట్లు ప్రకటించారు, బుద్ధుని పవిత్ర అవశేషాలను తిరిగి తీసుకురావడానికి అప్పగించబడిన ప్రతినిధి బృందానికి తాను నాయకత్వం వహిస్తానని చెప్పారు. చీ లో ఒక పోస్ట్‌లో, ఒఉ కార్యాలయం ఇలా పేర్కొంది, "రష్యాలోని కల్మికియాకు బయలుదేరుతున్నాను, అక్కడ వారం రోజుల పాటు జరిగే బుద్ధుని పవిత్ర అవశేషాలను తిరిగి తీసుకురావడానికి ప్రతినిధి బృందానికి నేను నాయకత్వం వహిస్తాను. ఈ పవిత్ర అవకాశం కోసం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. 'ఓం మామో బుద్ధాయ'.

అంతకుముందు రోజు, శ్రీ సిన్హా కల్మికియాకు బయలుదేరుతున్నట్లు ప్రకటించారు, బుద్ధుని పవిత్ర అవశేషాలను తిరిగి తీసుకురావడానికి అప్పగించబడిన ప్రతినిధి బృందానికి తాను నాయకత్వం వహిస్తానని చెప్పారు. చీ లో ఒక పోస్ట్‌లో, ఒఉ కార్యాలయం ఇలా పేర్కొంది, "రష్యాలోని కల్మికియాకు బయలుదేరుతున్నాను, అక్కడ వారం రోజుల పాటు జరిగే బుద్ధుని పవిత్ర అవశేషాలను తిరిగి తీసుకురావడానికి ప్రతినిధి బృందానికి నేను నాయకత్వం వహిస్తాను. ఈ పవిత్ర అవకాశం కోసం ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. 'ఓం మామో బుద్ధాయ'.

ఆధ్యాత్మిక భక్తి మరియు ఉమ్మడి సాంస్కృతిక వారసత్వం యొక్క శక్తివంతమైన ప్రదర్శనలో, భారతదేశం నుండి బుద్ధుని పవిత్ర అవశేషాల ప్రదర్శన రష్యాలోని కల్మికియా రిపబ్లిక్‌లో అపూర్వమైన స్పందనను పొందింది. నేటికి, తొంభై వేల మందికి పైగా భక్తులు "శాక్యముని బుద్ధుని స్వర్ణ నివాసం"గా ప్రసిద్ధి చెందిన ఐకానిక్ గెడెన్ షెడ్డుప్ చోయికోర్లింగ్ ఆశ్రమంలో ప్రతిష్టించబడిన అవశేషాలకు భక్తితో కూడిన నివాళులు అర్పించారు. భారతదేశ జాతీయ నిధిగా గుర్తించబడిన పవిత్ర అవశేషాలను ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ కేశవ్ ప్రసాద్ మౌర్య నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం మరియు సీనియర్ భారతీయ సన్యాసులు సహా రాజధాని నగరం ఎలిస్టాకు తీసుకువచ్చారు. ఈ ప్రతినిధి బృందం ప్రధానంగా బౌద్ధ జనాభా కోసం ప్రత్యేక మతపరమైన సేవలు మరియు ఆశీర్వాదాలను నిర్వహిస్తోంది. ఐరోపాలో బౌద్ధమతం ప్రధాన మతంగా ఉన్న ఏకైక ప్రాంతం కల్మికియా.

# పెండింగ్‌లో ఉన్న వస్తువులను పరిష్కరించడంలో సామర్థ్యాన్ని సాధించడానికి సిబ్బంది & శిక్షణ శాఖలో ప్రత్యేక ప్రచారం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 18:స్వచ్ఛతను సంస్థాగతీకరించడం మరియు కార్యాలయ సామర్థ్యాన్ని పెంచడం అనే గౌరవనీయ ప్రధానమంత్రి దార్శనికతను నెరవేర్చే లక్ష్యంతో, సిబ్బంది ఒ శిక్షణ శాఖ (ఆనీఖ), దాని అనుబంధ/సబార్డినేట్ సంస్థలతో కలిసి, ప్రత్యేక ప్రచారం 5.0 యొక్క ప్రధాన దశలో చురుకుగా పాల్గొంటోంది. అక్టోబర్ 2న ప్రారంభమైన ఈ ప్రచారం 2025 అక్టోబర్ 31 వరకు కొనసాగుతుంది, కార్యాలయ విషయాలలో పరిశుభ్రత మరియు పెండింగ్‌ను తగ్గించడంలో ప్రభావవంతమైన, కేంద్రీకృత మరియు గణనీయమైన మెరుగుదలలు చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.

శాఖలోని అన్ని అధికారులు, అలాగే శాఖ పరిపాలనా నియంత్రణలో దేశవ్యాప్తంగా పనిచేస్తున్న అటాచ్డ్ మరియు సబార్డినేట్ కార్యాలయాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఇప్పటివరకు, 585 కంటే ఎక్కువ శుభ్రతా స్థలాలు కవర్ చేయబడ్డాయి.

× మరియు ఫేస్‌బుక్ వంటి ఇతర ప్లాట్‌ఫామ్‌లలో అనేక ట్వీట్‌లు మరియు పోస్ట్‌లతో సోషల్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున అవగాహన మరియు ప్రచార ప్రచారం సోషల్ మీడియాలో చాలా ఆకర్షణను పొందుతోంది. ప్రచారం సందర్భంగా, సిబ్బందికి పని వాతావరణంలో మొత్తం మెరుగుదల తీసుకురావడం మరియు కార్యాలయ అనుభవ నాణ్యతను పెంచడంపై దృష్టి కేంద్రీకరించబడింది.

సిబ్బంది మరియు శిక్షణ శాఖ ఇటీవల నార్త్ బ్లాక్ నుండి ఢిల్లీలోని కర్తవ్య భవన్ 3కి మారింది, ఇది ఆధునిక కార్యాలయ సముదాయంతో పాటు, అధికారులు మరియు సిబ్బంది వారి వ్యక్తిగత మరియు వృత్తిపరమైన పరస్పర చర్యలలో మెరుగ్గా సంభాషించడానికి, కలిసి బంధం ఏర్పరచుకోవడానికి మరియు మరింత సమన్వయంతో కూడిన బృంద పనిని కలిగి ఉండటానికి వీలు కల్పించింది.

2025 అక్టోబర్ 02న స్పెషల్ క్యాంపెయిన్ 5.0 ప్రారంభమైనప్పటి నుండి, 52,112 కంటే ఎక్కువ భౌతిక ఫైళ్లు మరియు 2474 కంటే ఎక్కువ ఇ-ఫైళ్లు సమీక్షించబడ్డాయి మరియు 20,391 ఫైళ్లు తొలగించబడ్డాయి.

చర్య పూర్తయిన ఇ-ఫైళ్లను కూడా మూసివేస్తున్నారు.

పైన పేర్కొన్న పారామితులతో పాటు, ప్రభుత్వ కార్యాలయాల మొత్తం శుభ్రతను స్థల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, ఫీల్డ్ ఆఫీసుల పని ప్రదేశ అనుభవాన్ని మెరుగుపరచడం జరిగింది. ఆనీఖలోని కార్యాలయాలను దాని అటాచ్డ్ మరియు సబార్డినేట్ కార్యాలయాలతో పాటు శుభ్రపరచడానికి 16 శుభ్రతా ప్రచారాలు నిర్వహించబడ్డాయి. వ్యర్థాలు/స్క్రాప్‌లను పారవేయడం ద్వారా ఇప్పటివరకు రూ. 2,80,890/- ఆదాయం లభించింది. స్క్రాప్ పారవేయడం మరియు ఫైళ్ల తొలగింపు కారణంగా సుమారు 8228 చదరపు అడుగుల స్థలం ఖాళీ చేయబడింది.

ఈ కాలంలో 350 ప్రజా ఫిర్యాదులు మరియు 105 ప్రజా ఫిర్యాదుల అప్పీళ్లు, 15 ఎంపీ సూచనలు, 1 మంత్రిత్వ శాఖల మధ్య సూచన (క్యాబినెట్ ప్రతిపాదన) మరియు 7 ప్రధానమంత్రి కార్యాలయ సూచనలకు సమాధానం ఇచ్చి పరిష్కరించారు.

# శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాలలో అలరించిన స్వాగతోత్సవ వేడుకలు

కరీంనగర్, అక్టోబర్ 18: కోరుట్ల పట్టణంలోని వీబీ గార్డెన్స్ లో శనివారం శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాల విద్యార్థులు అరుణోదయ వైభవం 2025 పేరిట ఏర్పాటు చేసిన స్వాగతోత్సవ వేడుకలు అలరించాయి. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన సాంస్కృతిక, సినీ, జానపద నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన టెక్నాలజీపై దృష్టి సారించాలన్నారు.

సమాజంలో పోటీ తత్వం అలవర్చుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని మాదక ద్రవ్యాలకు అలవాటు పడవద్దు అన్నారు. సమాజంలో తమకంటూ ఒక గుర్తింపు తెచ్చుకొని తల్లిదండ్రులు గురువులకు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ ట్రాస్మా అధ్యక్షులు కేరళ హై స్కూల్ కరస్పాండెంట్ ఎంఏ భారీ, లిటిల్ జీనియస్ హై స్కూల్ కరస్పాండెంట్ బండి మహదేవ్, మాస్ట్రో విద్యా సంస్థల చైర్మన్ ఆకుల రాజేష్, శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, కళాశాల డైరెక్టర్లు కోడెల రాజేంద్రప్రసాద్, కొత్త రాజు, తదితరులు పాల్గొన్నారు.

# తండ్రిని హతమార్చిన కొడుకు

జన్నారం,అక్టోబర్ 18 తాగుడుకు బానిసైన కొడుకు కన్న తండ్రిని ఇంట్లో గొడ్డలితో నరికి చంపిన సంఘటన ఇది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని సేవదాస్ నగర్‌కు చెందిన జాదవ్ శంకర్ నాయక్ (45)ను ఈ రోజు సాయంత్రం 4 గంటలకు ఇంట్లో కొడుకు జాదవ్ నూర్ సింగ్ నాయక్ గొడ్డలితో తలపై నరికి హతమార్చాడు.

విషయం తెలుసుకున్న లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి స్థానిక ఎస్సై గొల్లపల్లి అనూష ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. అందరికీ వివాహమైంది.

# తిరుమలలో వారిని అసలే నమ్మవద్దు.. శ్రీవారి భక్తులకు టీటీడీ చైర్మన్ విజ్ఞప్తి

తిరుపతి, అక్టోబర్ 18:కలియుగ దైవం శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవలు, వసతి కోసం దళారులను నమ్మి మోసపోవద్దని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవలి కాలంలో కొందరు దళారులు , మధ్యవర్తులు శ్రీవారి దర్శనం పేరుతో భక్తులను పలు మార్గాల ద్వారా మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

ముఖ్యంగా టీటీడీలోను, ప్రభావిత స్థానాల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులమని కొందరు మాయమాటలతో మెరుగైన శ్రీవారి బ్రేక్ దర్శనం, ఆర్జిత సేవలు, వసతి కల్పిస్తామని ప్రలోభ పెడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని వివరిం చారు. ఇలాంటి నకిలీ వ్యక్తులు భక్తుల నుంచి భారీ మొత్తాలు వసూలు చేసి మోసం చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చాయని వెల్లడించారు. ఇప్పటికే భక్తులను మోసం చేస్తున్న దళారులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

భక్తులు టీటీడీ సేవలకు సంబంధించి https://ttdevasthanams.ap.gov.in , ttdevasthanams,మొబైల్ యాప్ ద్వారా ఆన్ లైన్‌లో తమ ఆధార్ కార్డు ఆధారంగా బుక్ చేసుకోవాలని కోరారు. టీటీడీ సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 155257 ను సంప్రదించాలని సూచించారు. దళారులపై అనుమానం వస్తే టీటీడీ విజిలెన్స్ అధికారులు 0877-2263828 సదరు ఫోన్ నెంబర్ లో నిరంతరం అందుబాటు లో ఉంటారని, ఫిర్యాదు చేయాలని సూచించారు.

# కళారూపాలను పునరుద్ధరిస్తోన్న ఏఎస్పిఎల్



హైదరాబాద్, అక్టోబర్ 18 : భావితరపు జీవన ప్రాంగణాలను సృష్టించడంలో ప్రాచుర్యం పొందిన ఏఎస్పిఎల్ ఇప్పుడు నృత్యప్రియ డ్యాన్స్ అకాడమీతో భాగస్వామ్యం చేసుకుని భారతీయ కళారూపాలకు పునర్వైభవం కలిగించటానికి ప్రయత్నిస్తోంది. నృత్యప్రియ డ్యాన్స్ అకాడమీ 10వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా కింగ్ కోఠీ లోని భారతీయ విద్యా భవన్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు భాగస్వామిగా వ్యవహరించింది. శ్రీ కృష్ణుడు ఇతివృత్తంగా నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో కూచిపూడి నృత్య రూపంలో దశాబ్దపు శ్రేష్ఠతను స్మరించుకునేందుకు 500 మందికి పైగా విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, కళాభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ వేడుకలలో భాగంగా అంబపరాకు, గణేశ పంచరత్నం, జయదేవ అష్టపది, నౌకా చరితం వంటి ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాంస్కృతిక దిగ్గజాలు డాక్టర్ మద్దాలి ఉషా గాయత్రి (సెంట్రల్ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ) అండ్ ఏఎస్పిఎల్ వ్యవస్థాపకులు, సీఈఓ అజితేష్ కొరుపోలు వంటి వారు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో అజితేష్ కొరుపోలు మాట్లాడుతూ? సంస్కృతి, ఒక సమాజానికి ఆత్మ లాంటిదన్నారు. మనం ఆధునిక జీవన ప్రాంగణాలను నిర్మించేటప్పుడు, వాటిలో భావోద్వేగ, సాంస్కృతిక సంబంధాలను నిర్మించడం కూడా అంతే ముఖ్యమైనదని తాము నమ్ముతున్నామన్నారు. నృత్యప్రియతో తమ భాగస్వామ్యం ఈ నమ్మకం వ్యక్తీకరణ అన్నారు.

# బాల్క సుమన్ ప్రజల నాయకుడు



లక్షెట్టిపేట, అక్టోబర్ 18 మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డ్ లో జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ విప్ డాక్టర్ బాల్క సుమన్ జన్మదిన వేడుకలను పార్టీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి మారిశెట్టి సుమన్ మాజీ కౌన్సిలర్ ఒరగంటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ ఒరగంటి శ్రీకాంత్ మాట్లాడుతూ.. బాల్క సుమన్ విద్యార్థి నాయకుడుగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఎమ్మెల్యేగా చెన్నూర్ నియోజకవర్గంలో ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేసి ప్రజలకు అండగా నిలిచారని, బాల్క సుమన్ ప్రజల నాయకుడని కొనియాడారు.

అనంతరం మాజీ మండల ప్రధాన కార్యదర్శి మారిశెట్టి సుమన్ మాట్లాడుతూ.. నేటి యువత బాల్క సుమన్ ను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

యువత ప్రశ్నించకుండా ఉంటే ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందవని, యువత సేవ కార్యక్రమాలకు ముందుకు రావాలని కోరుతున్నామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డ్ అధ్యక్షుడు కాసు ధర్మయ్యప్రధాన కార్యదర్శి ఒరగంటి శ్రీధర్, వార్డ్ ఉపాధ్యక్షుడు దర్శనల జనార్ధన్, పట్టణ నాయకులు బెత్తపు ప్రణీత్, అవునూరి అక్షయ్, అవునూరి పవన్, అద్దూరి సిద్దార్థ, అద్దూరి సుకుమార్, శ్యామ్ కుమార్, ఒరగంటి శ్రీకర్, అవునూరి కిరణ్, అవునూరి సాయికుమార్, ప్రవీణ్, స్నుహిత్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# 42శాతం రిజర్వేషన్లకై బీసీ సంఘాల బంద్ సక్సెస్

## - నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ



ఖమ్మం, అక్టోబర్ 18 (నేటినిజం ప్రతినిధి) : విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఖమ్మంలో బంద్ విజయవంతం అయ్యింది. ఖమ్మం నగరంలో శనివారం బీసీ సంఘాలు చేపట్టిన బంద్ ను విజయవంతం చేయడానికి 'నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక' నగర కమిటీ, యూత్ కమిటీ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. ఖమ్మం నగరం పాత బస్టాండ్ దగ్గర ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించి, క్షౌర వృత్తి చేస్తూ వినూతన పద్ధతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఖమ్మం పాత బస్టాండ్ దగ్గర నుండి బల్లేపల్లి వరకు నాయి బ్రాహ్మణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు యలమందల జగదీష్ మాట్లాడుతూ...నాయి బ్రాహ్మణులు స్వచ్ఛందంగా షాపులు బంద్ చేసి బందులో పాల్గొనడం అభినందనీయమన్నారు. రాష్ట్ర జనాభాలో 56శాతం ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. రాజకీయ పార్టీలన్నీ బీసీల 42శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలిపినప్పటికీ అమలు విషయంలో ఎక్కడ జాప్యం జరుగుతుందని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలు పట్ల సిద్ధ శుద్ధి ఉంటే తక్షణమే 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు పార్లమెంట్లో బిసి బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కమిటీ అధ్యక్షులు అద్దంకి రవి, సెక్రటరీ దోమకొండ మధు, నగర కమిటీ నాయకులు, యూత్ కమిటీ నాయకులు, సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల సాధనకై మేము సైతం

## - బార్ అసోసియేషన్ ఖమ్మం

ఖమ్మం, అక్టోబర్ 18 (నేటినిజం ప్రతినిధి) : బీసీల 42% రిజర్వేషన్ల సాధనకై కొరకై రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాల జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం ఖమ్మం కోర్టు ఎదుట ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం కోర్టు న్యాయవాదులు మేము సైతం బీసీల కొరకు మద్దతు తెలియజేస్తూ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... రాష్ట్రంలో 55% పైగా ఉన్న బీసీలకు దక్కవలసిన రిజర్వేషన్లు న్యాయపరమైనవన్నీ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందని, ఇక కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో బిల్లు పెట్టి 9వ షెడ్యూల్లో చేరిస్తే రిజర్వేషన్లు సాధ్యపడతాయని కావున కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని చిత్తశుద్ధితో బీసీ రిజర్వేషన్లు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.



న్యాయవాదులు చేపడుతున్న నిరసన దీక్షకు పలు పార్టీల జిల్లా నాయకత్వం మద్దతు తెలిపింది. ఈ కార్యక్రమంలో బార్ కార్యవర్గం కాంగ్రెస్, బిఆర్ఎస్, ఐలు, ఐఏఎల్ వివిధ సంఘాల న్యాయవాదులు, బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ 'నా దేశం నా ప్రజలు' అనే "ఆధునిక మహాభారతం" లోని రెండవ "సూర్య పర్వం" పై విశ్లేషణ

## (శేషేంద్ర 98 వ జయంతి 20-10-2025 సందర్భంగా.)

మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ **'నా దేశం నా ప్రజలు'** అనే **"ఆధునిక మహాభారతం"** లోని రెండవ **"సూర్య పర్వం"** ఒక విశ్లేషణ (శేషేంద్ర 98 వ జయంతి 20-10-2025 సందర్భంగా.) ఆధునిక తెలుగు సాహిత్య జగత్తులో మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ పేరు అజరామరం. వారు తెలుగు సాహిత్య సీమలో హిమవన్నగ సమానులు. శేషేంద్ర తన ఆధునిక మహాభారతం గురించి చెబుతూ ఇలా ఒక సూచన చేశా రు" వ్యాస భారతము ప్రాచీన ప్రజల కోసము పుట్టింది, ఈ ఆధునిక మహాభారతం ఆధునికయుగీన ప్రజల కోసము పుట్టింది. వ్యాస భారతము ఉత్తర భారత దేశంలో పుడితే ఈ ఆధునిక మహాభారతం దక్షిణ దేశంలో పుట్టింది. ప్రాచీన భారతం పండిత భాషలో పుడితే ఆధునిక భారతం ప్రజల భాషలో పుట్టింది. తొలుత వ్యాసభారతం 8 వేల శ్లోకాలు గల **'జయం'** అనే ఇతిహాసం అయితే ఆధునిక భారతం 8 సర్గలు గల "నా దేశం నా ప్రజలు " అనే ఇతిహాసంగా అంకురించింది. అది భూమి కోసం జరిగిన యుద్ధము అయితే ఇది కూడా భూమి కోసం జరిగిన యుద్ధమే. అక్కడ ఉన్నత కుటుంబాలు భూమిని హస్తగతం చేసుకోవడానికి యుద్ధం చేస్తే ఇక్కడ ప్రజానీకం భూమిని హస్తగతం చేసుకోవడానికి యుద్ధం చేస్తారు . వ్యాస భారతం లాగే ఇది కూడా క్రమంగా పెరిగి బృహద్గ్రంథం అయింది. దాని లాగే ఇది ఇతిహాసము , పురాణము, మహాకావ్యం, పారాయణ గ్రంథము. అలనాటి వ్యాస భారతము 18 పర్వాలు అయితే శేషేంద్ర ఆధునిక మహాభారతం 10 పర్వాలతో నిండి ఉంది .

**అందులో 1. ప్రజాపర్వం ('నా దేశం నా ప్రజలు') 2. సూర్య పర్వం ('మండే సూర్యుడు') 3. పశు పర్వం('గొరిల్లా') 4. ప్రవాహ పర్వము ('నీరై పారిపోయింది') 5. ఆద్మీ పర్వము ('అరుస్తున్న ఆద్మీ') 6. ప్రేమ పర్వం('ప్రేమలేఖ' ), 7.సముద్ర పర్వము(' సముద్రము నా పేరు') 8. జ్యోత్స్నా పర్వం ( శేష జ్యోత్స్న') 9. మౌక్తికపర్వము. ( చమత్కారికలు) 10. మయూర పర్వము.** ( నేను నా నెమలి). ఇలా 1970-1986 సంవత్సరముల మధ్య కాలములో శేషేంద్ర వ్రాసిన

కవితా సంకలనాల సమాహారం ఇది. ఇక శేషేంద్ర ఆధునిక మహాభారతం అవతారికలో ఇలా చెప్తారు 'నా ప్రతిభ, నా పాండిత్యము , నా అనుభవం ఈ అన్నింటిని జీర్ణించుకున్న నా ఆయుస్సు సర్వము పిండి మాటలు గొంతులో పోసిన ప్రక్రియ ఈ ఇతిహాసము' అన్నారు శేషేంద్ర . ఇంకా ఈ దేశానికి నాగలి ప్రతీక ఈ దేశ ఆకృతి నాగలి ఆకృతి

ఒక దానితో ఒకటి పోలి ఉంటుంది . దాని జీవన కథానాయకుడు అతడే ఈ దేశపు జీవన దాన ప్రభువు. **'ఇది నా కావ్య సంకలనం కాదు ఇది నా కావ్యము నా సంపూర్ణ కావ్యం'.** కవి అనేక కావ్యాలు రాయడు. కవి ఒకే మనిషి – ప్రవహిస్తున్న ఒకే జీవితం జీవిస్తాడు. అలాగే ఒకే కావ్యము రాస్తాడు . జీవితం ఒక యాత్ర అనేక మజిలీల ప్రయాణం. దీని అంతరార్థమే కవి కావ్య యాత్ర అనేక కృతుల సాముదాయిక స్వరూపం . అంటే ఒక కవి తన జీవితంలో ఒకే కావ్యము రాస్తాడు. అయితే దాన్ని అప్పుడప్పుడు క్రమక్రమంగా రాస్తూ ఉంటాడు . అలా రాయబడే ఒక్కో కృతి నిజంగా పూర్ణ కృతి కోసం పుట్టే ఒకో పర్వం కావ్య యాత్ర అంతిమ చరణంలో అన్ని పర్వాలూ కలిసి ఒక కావ్యం మాత్రమే అవుతుంది. కనుక నేను నా జీవితంలో అనేక కావ్యాలు రాయలేదు. రాసింది ఒకే ఒక కావ్యం దాని పేరు **'నా దేశం నా ప్రజలు'** దాని వర్తమాన నామాంతరం ఆధునిక మహాభారతం . ఆ కావ్యం యొక్క భాగాలు నా జీవితంలో అప్పుడప్పుడు రాస్తూ వచ్చాను, భిన్న భిన్న నామకరణాలతో వచ్చిన ఆ భాగాలే ఈనాడు నా ప్రజలకు సమర్పిస్తున్న సంపూర్ణ కావ్యములో పర్వాలుగా ప్రత్యక్షమవుతున్నాయి' అని చెప్పారు. శేషేంద్ర ఆధునిక మహాభారతం లోని రెండవ పర్వం **"సూర్య పర్వము"** అది 1974 లో శేషేంద్ర వ్రాసిన **'మండే సూర్యుడు'** కావ్యం లోనిది. అది 36 పేజీల్లో 3 సర్గల్లో ఉంది. శేషేంద్ర కవిత్వం ఒక తుఫాను, ఒక హోరు గాలి, ఆ హోరుగాలి కవిత్వంలో పడి కవిత్వ జీవులు కొట్టుక పోవాల్సిందే ! శేషేంద్ర కవిత్వము చదవడం అంటే కవిత్వంతో కరచాలనం చేయడం, కవిత్వంతో ప్రయాణం చేయడము లాంటిది. శేషేంద్ర కవిత్వం ఆకలింపు చేసుకోవడం అంటే కవిత్వాన్ని కవితామృతంలా గట గట తాగడం లాంటిది. శ్రీ శ్రీ భాషలో **'శేషేన్? నీది పద్యమా ఫ్రెంచ్ మద్యమా!'** అని కొనియాడబడిన శేషేంద్ర కవిత్వం, తిలక్ చెప్పినట్లు అది ఒక ఆల్కెమి ! బంగారంలా కవిత్వంను చేసే అద్భుత ప్రక్రియ. శేషేంద్ర కవిత్వంలో పద పదము కవిత్వ సంగీతం, అతని ప్రతి పాదాము ఒక కవిత్వం ప్రవాహం. అతని రచనలో కవిత్వం కానిదేది లేదు . శేషేంద్ర కవిత్వ మూల్యాంకనం అంటే కవిత్వం బంగారపు గని దగ్గరికి వెళ్లినట్లు భావన చెందడం, కవితల చెట్టుపై వాలిన వసంత కోకిలను తలచుకోవడం అన్నట్లు. ఇక్కడ **'మండే సూర్యుడు'** అంటే జగతికి వెలిగించే రవి. ఈ జగతిలో కవి కూడా రవి లాంటివాడే . తన భావాలతో జగతికి వెలుగులు నింపేవాడు కవి. కవి , రవి ఒక్కటే ! జగతిని వీక్షించే రవిలా, కవికి కూడా కావ్యవస్తువు కరువా ఈ జగతిపై. సూర్య పర్వము

ఒకటో సర్గ ఇలా మొదలు అవుతుంది.

**"నేను చెమట బిందువుని కండల కొండల్లో ఉదయించే లోక బంధువుని**

**గుండెలతో నాకు దోస్తీ నేనుండేది బాధల బస్తీ సింధువంత చరిత్ర నా పిడికిట్లో ఉన్నా చెప్పకుండా మనిషిని చెక్కిన శిల్పిని వెళ్ళిన పక్షుల గుంపులు వెనక్కి రాలేదని ఆక్రోశిస్తున్న అడవుల్లో చిక్కటి నక్షత్రాలు కలుపుకుని చీకట్లు ఆస్వాదిస్తున్నా స్మృతులతో అల్లిన పైట చెరగు పట్టుకుని నా దేశం పాదాలు పెనవేసుకుంటున్నా"** ఇది శేషేంద్ర కవిత్వం. కవిత్వ మంత్రం, మార్మిక జాలం. శేషేంద్ర కవిత్వంలో అడుగడుగున పోలికలు ఉంటాయి, ఉపమలు ఉంటాయి. అవే అతని కవిత్వానికి సుందర ఆభరణాలు. ఇక్కడ నేను అనే మనిషి చెమట బిందువుని కండల కొండల్లో ఉదయించే లోక బంధువుతో పోల్చారు . శేషేంద్ర కవిత్వంలో ఒక శ్రామికుడు ఉంటాడు, అతని దేశం ఉంటుంది, ఆ దేశంలోని అంగాంగాలు ఉంటాయి, అడవులు ఉంటాయి, సముద్రాలు ఉంటాయి, కొండలు ఉంటాయి, నదులు ఉంటాయి, బ్రతుకడానికి అతని పోరాటాలు, ఆరాటాలు ఉంటాయి.

ఆ సర్గ లోనే ఇలా అంటారు శేషేంద్ర,

**" చెట్లకు వ్రేలాడిన శిరసులు పూస్తున్నయ్.**

**కొమ్మల్లో పూలై గోలీ దూరిన గుండెలు కదులుతు న్నాయ్ గుడిలో ఘంటలై ఎందరు ఎన్ని రాత్రుల రక్తం పిండి ఇచ్చారో**

**ఈ దినం కోసం మన పంచల మంచుబిందువులై**

**వ్రేలాడుతున్నారు?."** ఇది ఏ దేశ చరిత్రకు సాక్ష్యం. ప్రపంచ చరిత్రలో ఎల్లలు తెలియని సీమల గురించి చెప్పే కవిత్వం ఇది. చెట్లకు ఉరి తీయబడిన శవాలు చెప్పిన కథలు ఎన్నో కదా! వాటి ఆత్మ ఘోషలు, మౌన సందేశాలు ఎన్నో కదా! కవి కవిత్వం రాస్తాడు, దేశ కాల పరిస్థితుల గురించి రాస్తాడు.

అది అందమైన కవిత్వంలో రాస్తాడు. అందుకే అతడు కవి, మహా కవి అనబడుతాడు. అతని కవిత్వం విశ్వ జనీనమవుతుంది. చెట్లకు వ్రేలాడిన శిరసులు కొమ్మల్లో పూలై పూయడం, గోలీ దూరిన గుండెలు గుడిలో ఘంటలై కదులడం




ఇది గొప్ప అభివ్యక్తి. ఇది దృశ్యమయ కవిత్వం.

ఇంకొద్దిగా ముందుకు వెళితే,

**"నేను ఒక పాటని అడవిలో సరిగమ లల్లుతూ ముత్యాల గుంపుల్లా పరుగులెత్తే వాగుని**

**నీలిమలో మధురిమ చల్లుతూ రెక్కలమీద తేలిపోయే పక్షిని**

**తోటలో వసంతం గుండెలో గ్రీష్మం ఎటు పోవాలో తెలీని బాటసారిని**

**నా వాక్యం ఒక పిల్లనగ్రోవి లోపల గాలి తప్ప అర్థం ఉండదు గొంతు మాత్రం ఎందుకు తియ్యగా ఉంటుందో తెలీని దిక్కుమాలిన పాటని–"**

ఇది శేషేంద్ర అద్భుత కవిత్వం. శేషేంద్ర కవిత్వం పదాలను పట్టుకొని ఉంటుంది, వాక్యాలను అలుముకొని ఉంటుంది వాటికి పద సౌందర్యాన్ని ఇస్తూ. అందరికీ అందదు, అందరికీ చెందదు కవిత్వం. కవిత్వ రసాస్వాదన, నిర్మాణ పద్ధతి శేషేంద్ర లాంటి కొందరికే

> "ఇది శేషేంద్ర కవితా జీవన యాత్ర, కవి హృదయం కరుణా హృదయం, కవిది జీవన వేదన, సకల చరాచర సృష్టి లోని జనుల హితం కోరి కవి కవిత వ్రాస్తాడు. రోజులను పండ్లను తిన్నట్టు అనుభవిస్తూ, ద్రాక్ష పండ్ల అంతటి కన్నీటి బిందువులను తింటున్నాను అన్నారు శేషేంద్ర."

చెందుతుందేమో అనిపిస్తుంది. కవి పరిపరి విధాలుగా ప్రకృతితో మమేకమై పోతుంటాడు. ఇక్కడ కవి పాట అయ్యాడు, పక్షి అయ్యాడు, బాటసారి అయ్యాడు. ఎలా అయ్యాడు, ఏమి అయ్యాడో కూడా అద్భుతంగా చెప్పాడు శేషేంద్ర.

అడవి లోని సరిగమల పాటని ముత్యాల గుంపుల్లా పరుగులెత్తే వాగుతో పోల్చాడు. తనను తాను నీలిమలో మధురిమ చల్లుతూ ఎగిరి పోయే పక్షిని అన్నాడు.

తన గురించి చెపుతూ తోటలో వసంతమును చూస్తూ గుండెలో గ్రీష్మంతో ఎటు పోవాలో తెలీని బాటసారిని అన్నాడు.

ఇంకా 'నా వాక్యం ఒక పిల్లనగ్రోవి' అన్నాడు. ఎన్ని వేదనలు పడి హృదయాన్ని తూట్లు పొడుచుకుంటే పిల్లన గ్రోవి మధురంగా పలుకుతుందో కదా ! కవి వాక్యం ఒక పిల్లన గ్రోవి ! ఇంకాస్త ముందుకు వెళితే ,

**"ఒక పావురంలా రాత్రి నా గుండె మీద వాలింది**

**బాధల తుఫానుని ఒక్క నవ్వుతో తుడిచివేశాను**

**నా భాష తననిండా బాధలు నింపుకుంది నేను అధరాల మీద మౌనం విధించుకున్న పర్వత శ్రేణిని"**

ఇవి శేషేంద్ర కవితా వాక్యాలు. కవి భావన రసాస్వాదన! రాత్రి పావురంలా వచ్చి గుండె మీద వాలితే బాధల తుఫాను ఒక్క నవ్వుతో తుడిచేసాను అంటున్నారు. తన భాష బాధల్ని నింపుకుంటే దానిని మౌనంగా మోస్తున్న వాన్ని అంటున్నాడు కవి. తన గురించి, తన కవితా సృజన గురించి చెపుతూ శేషేంద్ర ఇలా అంటారు, " **పువ్వుల్నించీ నిశ్శబ్దాల్నించీ పుట్టిన వాడ్ని వెళ్ళేటప్పుడు నా చేయి పూలగుత్తికి తగిలింది; అయ్యో! దెబ్బతగిలిందేమో అన్నాను. కానీ, నీకా నాకా అన్నది ఆ పువ్వు నవ్వుతూ. నా కలం గుండె చిటిలి రక్తం చిందింది. మరి ఈ కలాన్ని ఏ కాగితం భరిస్తుందో చెప్పలేను."** కవి సున్నిత హృదయుడు! పువ్వుకు దెబ్బ తగిలిందేమో అంటే, అలా పుట్టిన కవితను ఏ కాగితం భరిస్తుందేమో అంటున్నారు. ఇంకా, "పళ్ళు తిన్నట్లు దినాలు తిన్న నేను ద్రాక్ష పళ్ళంత కన్నీటి బిందువులు తింటున్నాను.

కన్నీటిలో గుండె పిండి కవిత మీద అర వేశాను. జనతా శాలువా కప్పుకుని చరచరా వెళ్ళి పోయాను దేశ దేశాల జ్వాలల సభల్లో నా దేశ ద్రిమ్మరి కంఠం విప్పి భూనభోంతరాలు కలుపుతూ గానం చేశాను."

ఇది శేషేంద్ర కవితా జీవన యాత్ర, కవి హృదయం కరుణా హృదయం, కవిది జీవన వేదన, సకల చరాచర సృష్టి లోని జనుల హితం కోరి కవి కవిత వ్రాస్తాడు. రోజులను పండ్లను తిన్నట్టు అనుభవిస్తూ, ద్రాక్ష పండ్ల అంతటి కన్నీటి బిందువులను తింటున్నాను అన్నారు శేషేంద్ర. ఇది అందమైన భావన. కన్నీటిలో గుండె పిండి కవిత మీద అర వేసి. దేశ దేశాల సభల్లో తన దేశద్రిమ్మరి కంఠం విప్పి భూనభోంతరాలు కలుపుతూ గానం చేశాను అనడం అతని ఆత్మ విశ్వాసం, సహజ సృజన శీలత.

శేషేంద్ర కవిత ఎప్పుడూ ఒక అందమైన భావననే! **"సూర్యుడు అస్తమించని నా మాటల దేశాల్లో చెమట ముత్యాల కిరీటాలు దాల్చిన దేవతలు**

**సూర్య స్నానాలు చేసే దినాలే గానీ చీకట్లు చెరలాడే నక్షత్రాల అరణ్యాల్లేవు**

**మూస్తే నా కళ్ళు**

**నిద్రిస్తున్న ఆపిల్ పళ్ళు. తెరిస్తే నా గుడ్లు**

**వరివెన్ను కన్న వడ్లు.."**

పై భావనలో శేషేంద్ర కవిత్వం విశ్వవ్యాప్తం. అతని కవితా ప్రపంచంలో వెలుగుల దివ్వలే గాని చీకటి అరణ్యాలు లేవు అంటారు. మూస్తే నా కళ్ళు నిద్రిస్తున్న ఆపిల్స్ పళ్ళు, తెరిస్తే నా గుడ్లు వరివెన్ను కన్న వడ్లు.. " అనడం బాగుంది లాయాత్మకంగా.

శేషేంద్ర తన కవితా ప్రయోజనాన్ని , తన కవితా మార్గాన్ని ఈ క్రింది విధంగా తెలియ చేస్తున్నారు

"అదే నా రాస్తా ఏ రస్తా ప్రజాకోట్ల అడుగులతో పునీతం అయిందో అదే నా రాస్తా.

ఏ రాస్తా నా దేశం శరీరంలో పల్లెల గుండా పట్నాల గుండా మండే రక్తనాళంలా పరుగెత్తుతోందో అదే నా రాస్తా ఏ రస్తా లోకం సుఖం కోసం తను కష్టాల్ని వరించిందో అదే నా రాస్తా?.

ఏ రస్తాలో సంకెళ్ళు కూడా సవాల్ చేస్తాయో ఏ రస్తాలో అపజయం కూడా అగ్నిజ్వాలై మండుతుందో ఏ రస్తాలో మరణం మహాప్రబంధంగా ప్రతిధ్వనిస్తుందో అదే నా రాస్తా....."

ఇది శేషేంద్ర కవితా మార్గం, అతడు ప్రజల కోసం రాసిన కవి, మనిషి. అందుకే అతని కవిత్వం అజరామరం. ఇక సూర్య పర్వము రెండవ సర్గలో శేషేంద్ర ఇలా చెపుతారు,

**"ఆవులిస్తూ లేచాను కళ్ళు నులుముకుంటూ ఆకలి దిక్కుల్ని దహిస్తోంది /సూర్యుడు ప్రాచీరేఖ మీద ఉన్నాడు/ అలమారు మీద ఆపిల్ పండులా–**

**నా మీదికి నేనే ఎక్కాను /దాన్ని అందుకుని తిందామని! ఎండ కండలా వ్రేలాడుతోంది ఆకాశపు మండువా అంచుల్నించి / నేను క్రూరమైన మాంసాహారిని / రోజూ నన్ను తిని/**

**గ్లాసెడు నా చెమట తాగి తేన్చేవాడు/ నున్నగా టొమాటో పండులా ఉన్నాడు/ వాడ్ని తిమితిమింగలాల్లాంటి వాక్యాలతో తిడతా / వాడ్ని తిని సముద్రాన్ని గటగట తాగేస్తా ఈ ఎర్రటి ఉదయం–"** కవి యొక్క ధర్మాగ్రహం ఇది చెమటోడ్చే శ్రామికుడు పక్షాన అప్పనంగా కూర్చొని దోచుక తినే వాడిపై. సూర్యుడు ఈ కావ్యంలో ఒక ప్రతీక. ఆ సూర్యుడి గురించి ఇలా చెపుతున్నారు శేషేంద్ర ప్రకృతిని నిశితంగా పరిశీలన చేస్తూ.

**" వర్షం వెయ్యి చేతులతో నా తలుపు కొడుతూ ఉంది?..**

**ఎంతదూరాన్నించి వచ్చిందో**

**ఏ సందేశం తెచ్చిందో ఈ వాన**

**బురదలో మండూక సమూహాలు యుద్ధాలు చేస్తున్న గోల**

**వర్షం వెళ్ళిపోయింది**

**మబ్బుల రథా లెక్కి**

**నాగలి భుజాన వేసుకుని వస్తున్నాడు సూర్యుడు కొండ శిఖరాలెక్కి / జలదానం చేసిన మేఘాలకి జోహర్లు చెప్పాయి చరాచరాలు / భూమిలో ఉన్న చిన్నారి గింజ మెడ బయటి పెట్టి మొదట వచ్చిన రెండాకుల్ని చేతులుగా జోడించింది కృతజ్ఞతతో –"** ఇది కవిత్వం. ఇది ప్రకృతి పరిశీలనం. మేఘాలు, వాన, చరాచరాలు, సూర్యుడు, నాగలి, గింజ, మొక్క ఇది ఒక జల చక్రం. ఇది ప్రకృతి ఒక వినమ్ర ప్రార్థన! ఒక నివాళి! ఈ సూర్యపర్వం మూడవ సర్గలో సూర్యుడి గురించి కింది విధంగా చెప్తున్నారు శేషేంద్ర. సూర్యుడే సకల జీవులకు జీవశక్తిని ఇచ్చే దాత. ఈ విశ్వంలో సర్వశక్తులకు మూలము సౌర శక్తియే. శిశువులకు, పశువులకు, పక్షులకు, చెట్లకు, గుట్టలకు శక్తిని ఇస్తూ, నేలలోనూ, నీటిలోనూ, ఆకాశంలోనూ సర్వదా నిక్షిప్తమై ఉంది సౌర శక్తి యే. ఆ విషయాన్నీ చెపుతూ, **" చెట్లలో సూర్యుడు మేఘాల్లో సూర్యుడు జలాల్లో సూర్యుడు ఆకాశంలో సూర్యుడు**

**లోపల సూర్యుడు వెలుపల సూర్యుడు సూర్యుడు నా గోళ్ళలో ఉదయిస్తాడు–**

చెట్లు లక్షలాది ఆకులతో ఎండ తాగుతాయి సూర్యుడి శిశువులుగా బ్రతుకుతాయి నరనరాల్లో సూర్యుడి అంశ వృద్ధి పొందుతుంది చెట్టు సూర్యుడ్ని గర్భంలో ధరిస్తుంది.

గర్భంలో లేత జ్వాలలు ముడుచుకుని శిశువు సమాధిలో వుంటాడు చెట్టు గర్భం అంతర్లోక ఆకాశం అగ్ని అంతః సూర్యుడు–అగ్నిలో కిరణాలు దాచుకుని లోకంలో రంగులన్నీ పోగు చేసుకుని వెళ్ళిపోతాడు సూర్యుడు " ఇది సూర్యుని యొక్క వివిధ రూపాల సారం కవి భావనలో.

"చెట్టు సూర్యుడ్ని గర్భంలో ధరిస్తుంది" అనడం చెట్టుకు జీవాన్ని పచ్చదనాన్ని ఇచ్చేది సూర్యుడే కదా! 'చెట్లు లక్షలాది ఆకులతో ఎండ తాగుతాయి' అనడం గొప్ప విశేషం. ఒక సందర్భంలో ఈ వ్యాస రచయిత శేషేంద్ర ను ఇంటర్వ్యూ తీసుకున్నపుడు, చెట్టు గురించి చెపుతూ " చెట్టు ఆకులు దాల్చిన వీణ " అన్నారు శేషేంద్ర . ఈ భావన ఎందరికి తడుతుంది. తన గురించి, జీవితం గురించి చెపుతూ, " ప్రవహించే కాలంలో పరుగెత్తే రంగుల చేప

### జీవితం–

కన్నీళ్ళ వలలో పడదు కలల గాలానికి తగలదు బాధల్లో మునుగుతాను సంతోషాల్లో ఉదయిస్తాను నేను మానవసూర్యుడ్ని –" అంటారు శేషేంద్ర ఆత్మ విశ్వాసంతో. కవిత్వం మనిషికి ఆత్మ విశ్వాసాన్ని, గుండె ధైర్యాన్ని ఇవ్వాలి. బ్రతుకడానికి భరోసాను ఇవ్వాలి. బ్రతుకడానికి ఊత కర్ర కావాలి. శేషేంద్ర కవిత్వం అలాంటిదే. అందుకే అంటారు, " రేపు నీదే పద ఉదయించే నదే నవలోకం అరిపోనీకు సఖా గుండెలో ఆశాదీపం– ఓడిపోయానని చింతించకు పద్మవ్యూహం జీవితం కాదిది అడుగడుగున ఒక పోరాటం – రాలనీ బోకుము నీ కన్నులలో ముత్యాలు మోయలేదీభువి ఆ రగిలే సముద్రాలు–

నీవు నీ పిల్లలు తోటల్లో విహరిస్తారు కోలుపోయిన నవ్వు తిరిగి సాధిస్తారు" అని సరళ సుందరంగా మానవులకు హితబోధ చేస్తారు ఆత్మ విశ్వాసంతో బ్రతకండి అని. కవి ఒక వ్యక్తి కాదు, కవి ఒక సమూహ శక్తి. ఆ శక్తిని తన జాతి జనులకు తన కవితల ద్వారా దారపోస్తాడు కవి.

అలాంటి కవి మామూలు కవి కాదు, మహా కవి అనబడుతాడు. అలా శేషేంద్ర అక్షరాలా మహాకవి. ఆ మహాకవి నుండి పుట్టిందే ఈ " మండే సూర్యుడు" అనే కవితా కృతి. ఆ కృతి గురించి చెపుతూ ఇలా వ్రాస్తారు ముగింపులో ఎంతో గొప్పతనముతో శేషేంద్ర .

" ఇది వింశతి తమశతాబ్ద చతుస్సప్తతి తమ సంవత్సరాన (1974) విప్లవభాషావిధాత కవిసేన మేనిఫెస్టో ప్రణేత బుధజనవిధేయ శేషేంద్రనామధేయ కవివర్యప్రణీత మండే సూర్యుడు నామాంతర సమేత సూర్యపర్వము సమాప్తము" శేషేంద్ర 'మండే సూర్యుడు' ఒక అద్భుత రస సృష్టి కావ్యం.

ఈ కావ్యంలో ఏ పంక్తి ముట్టుకున్నా అద్భుత కవిత్వంతో భాసిస్తుంది అది . శేషేంద్రది అంది అందని అద్భుత కవిత్వం, అందమైన కవిత్వం. అది హృదయాలకు అందుతుంది ఒకోసారి, అది మేధస్సును కూడా వికసింప చేస్తుంది ఒకోసారి. కవితల చెట్టు పైన వాలిన వసంత కోకిల లాంటి వారు శేషేంద్ర . ఆ కవితా కోకిల కవితా గానం ఆస్వాదిద్దాం.



–సబ్బని లక్ష్మీనారాయణ
సెల్:8985251271

# పోస్టుమాన్ సిబ్బందికి జాగృతి పత్రిక ఆత్మీయ సన్మానం

కరీంనగర్, అక్టోబర్ 18: (నేటినిజం ప్రతినిధి). జాగృతి తెలుగు జాతీయవాద వార పత్రిక ఆధ్వర్యంలో శనివారం రోజున కరీంనగర్ ప్రధాన తపాల కార్యాలయంలో పోస్టుమాన్ సిబ్బందిని ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా జాగృతి పత్రిక బాధ్యులు , కార్యక్రమానిర్వాకులు మాట్లాడుతూ దేశ సేవలో ప్రతి వృత్తి ఒక సాధనమని, పోస్టుమాన్ సేవలు సమాజానికి అతి సమీపంగా ఉండే సేవలని తెలిపారు.

జాగృతి పత్రికను సకాలంలో చందాదారులకు చేరవేయడంలో పోస్టుమాన్‌లు చూపిస్తున్న కర్తవ్య నిబద్ధత, సమయపాలన ప్రశంసనీయమన్నారు. గత రెండేళ్లుగా జాగృతి పత్రిక ఆధ్వర్యంలో తపాల సిబ్బందికి సేవా గౌరవం కొనసాగుతోందనీ, .వివిధ సందర్భాల్లో పోస్టుమాన్‌లకు రెయిన్‌కోట్లు, వాటర్ బాటిల్స్, గొడుగులు, టవల్స్ వంటి అవసరమైన వస్తువులు అందజేసి, వారి



సేవలకు గౌరవం తెలుపుతున్నామని చెప్పారు.

గత 77 సంవత్సరాల నుండి నిర్విరామంగా కొనసాగుతున్న జాగృతి పత్రిక ద్వారా అసలైన సమాచారాన్ని సమాజానికి అందించడంలో పోస్ట్ మెన్ ల భాగస్వామ్యం ఎప్పటికీ ఉండాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో పోస్ట్మాస్టర్ తిరుపతి, విభాగ వ్యవస్థ ప్రముఖ్ దావులూరి మురళీధర్,జిల్లా ప్రచార ప్రముఖ్ శ్రీనివాస్, ఓదెల మల్లికార్జున్, బట్టు వెంకటేష్, భూమ్ రావు, ఓరుగంటి విష్ణు, బాబురావు , పోస్ట్ మెన్ ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మానవత్వం చాటుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 18:(నేటి నిజం ప్రతినిధి): ఇటీవలక్యాన్సర్ వ్యాధితో మృతి చెందిన కుటుంబానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రూ. 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కూరగాయల కొమరయ్య నాగుల విష్ణు ఖమ్మం గణేష్, కొండ శేఖర్, తదితరులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.



# పోతంగల్ లో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నిజామాబాద్, అక్టోబర్ 18:సామాజిక సేవాకర్త, మండల బీఆర్ఎస్ నాయకుడు ఎంఏ హకీం స్థానిక నాయకులతో కలిసి శనివారం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. పోతంగల్ గ్రామానికి చెందిన ఒడ్డెర సాంబయ్య అనారోగ్యంతో మృతి చెందారు. కాగా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక పోవడంతో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్ సామాజిక సేవాకర్త హకీంకు సమాచారమిచ్చారు.

ఈ మేరకు హకీం వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిరుపేదలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మండల బీఆర్ఎస్ నాయకుడు సమీర్, పాబ్బ శేఖర్, పగాల నవీన్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

# అద్భుతమైన కోచర్ రన్‌వే ప్రదర్శనతో అభినవ్ మిశ్రా ఢిల్లీలో కొత్త కలెక్షన్ ది ష్రైన్‌ను ప్రారంభించారు

హైదరాబాద్, అక్టోబర్ 18:అక్టోబర్ 4వ తేదీ సాయంత్రం, ప్రశంసలు పొందిన కోటురియర్ అభినవ్ మిశ్రా ఛతర్‌పూర్‌లోని పచ్చని తోటలలో, నక్షత్రాల కింద అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తన వార్షిక కోచర్ రన్‌వే ప్రదర్శనలో ది ష్రైన్‌ను ఆవిష్కరించారు. ఒక మైలురాయిగా నిలిచిన ఈ కార్యక్రమంలో మిశ్రా మ్యూజ్, షోస్టాపర్‌గా నిలిచిన సారా అలీ ఖాన్ ర్యాంప్ వాక్‌తో రెండవసారి ఆకర్షణగా నిలిచారు. రన్‌వేపై తన మొట్టమొదటి తోబుట్టువుల ప్రదర్శనలో ఆమె సోదరుడు ఇబ్రహీం అలీ ఖాన్ కూడా చేరారు.

అభినవ్ మిశ్రా ప్రతి ప్రదర్శన ఒక అద్భుత దృశ్యం. ది ష్రైన్ దీనికి మినహాయింపు కాదు. మార్గనిర్దేశక రన్‌వే అనుభవాలను సృష్టించడంలో గుర్తింపు దక్కించుకున్న మిశ్రా, రాత్రిని ఒక సజీవ కళాఖండంగా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. అలంకరణ ప్రేరణతో రాణి పింక్ పరిపూర్ణతను తీసుకువచ్చారు. రాత్రి ఆకాశం కింద, ఆ జంట రాతితో చెక్కిన కలలా, నిశ్శబ్ద వైభవంలో పైకి లేచేలా నిర్మించిన మెట్ల బావిలా, అనంతంలోకి దిగుతున్న టెర్రస్‌లా విప్పారింది. ప్రతి స్థాయి అద్దాల కాంతిలో ఆవరించి, శతాబ్దాల గుసగుసలాడే కథలను ప్రతిధ్వనించింది. దాని అంచుల నుంచి, సమూహాలలో పొరలుగా ఉన్న గొడుగులు జ్వాలల ప్రతిబింబాన్ని ఆకర్షించాయి. వేలాది కొవ్వొత్తులు మొత్తం ప్రాంగణాన్ని ప్రకాశవంతంగా మార్చాయి. పురాతన మెట్లకు వ్యతిరేకంగా మెరుస్తూ, అగ్నిజ్వాల జ్యామితిని కవిత్వంగా మార్చింది. లోతును కలుసుకునే మాధుర్యాన్ని, పొరలుగా ఉన్న కాంతి థియేటర్‌లో మృదుత్వంతో నృత్యం చేసే నిర్మాణాన్ని మార్చింది. సంగీతకారులు గాలిని శ్రావ్యతతో నింపారు.

**BEFORE THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL-CUM-I- ADDL CHIEF JUDGE AT SECUNDERABAD**
**O.P.NO.116 OF 2024**
**Between:**
1. G. Yellesha
2. D. Renuka
3. C. Pushpavathi
….Petitioners No.1 to 3
**AND**
1. Surender Kumar Bharti
2. Rana Ultratech
3. IFFCO TOKIO General Insurance Com Ltd,
..Respondent no. 1 to 3
To
1. Surendar Kumar Bharti S/o. Jagadeesh Prasad, Age: 23 Yrs. Occ: Lorry Driver, R/o. H.No.6-150, Rana Altratech, Gandi maisamma Dundital, Medchal Dist-500043.
To
2. Rana Ultratech Rep by. Sallangula Venkateshwarlu. Age: Major, Occ: Driver R/o. 6-150, Bowram pet, Dundigal, Medchal- 500 043.
Please take notice that the above named Petitioners filed the above O.P. No.116 of 2024, for grant of compensation for accidental death of their father by name: G. Lachaiah, U/S: 166 of M.V. Act, and the above matter is posted for your appearance and counter. If any hence you are hereby required to appear before the honourable I Addl. Chief Judge, at Secunderabad, on **22.10.2025** at 10.30 A.M. either in personal or through an Advocate duly instructed by you in the above honourable Court, failing which the matter will be decided on merits by setting you Ex.-Party.
(By Order Of The Court)
**M. SRINIVAS**
Advocate
Cell: 9848496288

# అవధూత్ సాథే ట్రేడింగ్ అకాడమి మా ప్రాధాన్యత బోధన మరియు శిక్షణలపై మాత్రమే కేంద్రీకృతమై ఉంది

హైదరాబాద్, అక్టోబర్ 18:గత కొన్ని రోజులుగా మేము అందుకున్న అనేక విచారణలకు స్పందనగా ఈ ప్రకటన జారీ చేయడం అయినది. మేము మా విధివిధా నాలను స్పష్టం చేస్తూ మా విద్యార్థులు మరియు కమ్యూనిటి నెట్వర్క్ కు పారదర్శక తను అందించడం మా ఉద్దేశం.మేము రాఇఃఏ తో పూర్తిగా సహకరిస్తూ వారు కోరిన అదనపు సమాచారము లేదా సహకారాన్ని అందించడానికి మేము కట్టుబడి ఉన్నాము. అత్యధిక ప్రమాణాలు, పారదర్శకతను నిర్ధారిం చుటకు మేము వారి మార్గదర్శనాన్ని స్వాగతిస్తున్నాము.ఈ మధ్య కాలము లో అపోహలకు తావిచ్చే సమాచారాన్ని కొందరు వ్యాప్తి చేయబడింది, దీనికి స్పష్టత ఇవ్వవలసి ఉంది. అవధూత్ సాథే ట్రేడింగ్ అకాడమి ఒక శిక్షణ సంస్థ మాత్రమే. ఎట్టి ప్రయోజనాల కోసం, వ్యక్తిగత సలహాలు ఇవ్వడం, ఫిన్‌ఫ్లుయెన్సర్లుగా వ్యవహరించడం, పరిశోధనా నివేదికలు, స్టాక్ రికమెండేషన్లు ప్రచారం చేయడం జరగదు. మేము గురుకుల శిక్షణ వ్యవస్థను అనుసరిస్తూ మార్కెట్లో ఒడిదుడుకులను తట్టుకోవ టానికి కావలసిన విలువలు, నైపుణ్యా న్ని, జ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తు న్నాము.– మేము పరిశోధన నివేదిక లను లేదా స్టాక్ కి సంబంధించిన సిఫారసులను ప్రచురించము లేదా వ్యాప్తి చేయము– మేము పర్సనలైజ్డ్ పెట్టుబడి సలహాలను అందించము.– అలాగే మేము వాణిజ్య చిట్కాలను, స్టాక్ కాల్స్ ను ఇవ్వము లేదా హామీ ఇవ్వబడిన రాబడూలను ఇవ్వము. అవధూత్ సాథే ట్రేడింగ్ అకాడమీ వద్ద మా దృష్టి ఎప్పుడు నిర్మాణాత్మక శిక్షణ కార్యక్రమాల ద్వారా స్వతంత్ర వ్యాపారవేత్తలు మరియు పెట్టుబడి దారులను అభివృద్ధి చేయడమే మా లక్ష్యం. మా శిక్షణ సెషన్లు విశ్లేషణాత్మ కత, అమలు మరియు నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలను అభివృద్ధి చేయటానికి రూపొందించబడ్డాయి, తద్వారా మా విద్యార్థులు జ్ఞానం, క్రమశిక్షణ మరియు ఆత్మవిశ్వాసముతో ట్రేడ్ చేయటానికి సంసిద్ధులై ఉంటారు.భారతదేశపు క్యాపిటల్ మార్కెట్స్ ను రూపకల్పన చేయడము లో రాఇఃఏ కీలక పాత్ర పోషిస్తుంది. వారి క్రియాశీలత మరియు పారదర్శక నియంత్రణ వల్లనే భారతదేశము ఈరోజు ప్రపంచవ్యాప్తంగా నాల్గవ– అతిపెద్ద ఈక్విటి మార్కెట్ గా నిలిచి ంది. డీమాట్ అకౌంట్స్ సంఖ్య కూడా ఆగస్ట్ 2025 నాటికి 20 కోట్లు దాటింది. ఇది బలమైన పెట్టుబడి దారుల భాగస్వామ్యాన్ని మరియు ఆర్థిక భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తుం ది.ఈ అభివృద్ధి పథానికి అద్దం పట్టే లా, భారతదేశ క్యాపిటల్ మార్కెట్స్ లో బాధ్యతాయుతంగా మరియు సమర్థవంతంగా పాల్గొనుటకు వ్యక్తు లను సిద్ధం చేయడములో నిర్మాణాత్మక శిక్షణ కార్యక్రమాలు మరియు పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమాలు ప్రధాన పాత్ర పోషించాలి.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com